క్లుప్తంగా

స్వగ్రామం చేరిన మృతదేహం

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన తిప్పలబోయిన సాయిలు(42) వారం రోజుల క్రితం దుబాయిలో గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృత దేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. కుటుంబ సభ్యుల కన్నీటి రోధనల మధ్య మృతుడి అంత్యక్రియలు గ్రామంలో నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో బుధవారం విద్యుత్‌షాక్‌తో కుర్మశెట్టి గంగకిషన్ అనే రైతుకు చెందిన గేదె మృతిచెందింది. గేదె రోజువారి ప్రకారం గ్రామశివారులో మేతకు వెళ్లగా, అక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కిందికి ఉండడంతో విద్యుత్‌షాక్ తగిలి మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందని తెలిపారు.

రైతుల భూములు లాక్కోవడం సరికాదు



మాక్లూర్: స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ నేత రాజకీయ లబ్ధి కోసం రైతుల భూములు లాక్కొని, కుల సంఘాల భవనాలకు కేటాయించటం సరికాదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు భూమయ్య పేర్కొన్నారు. మండలంలోని బోర్గాం(కె)లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోర్గాం(కె) శివారులోని డి సాయిరాంకు చెందిన సర్వేనెంబర్ 413 గుంట భూమిని పట్టేదారుకు తెలియకుండానే సదరు నేత కుల సంఘాలకు కేటాయించారన్నారు. ఎన్నికల్లో గెలవడానికి కులాల వారిగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న సదరు నేతపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సాయిరెడ్డి, మురళి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని 6వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు ఇరువురు దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సౌత్ సీఐ వెంకట్‌నారాయణ బుధవారం తెలిపారు. దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

బాధితులను ఆదుకోవాలి

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లో జై భీమ్‌నగర్ కాలనీలో మంగళవారం రాత్రి కురిసిన వడగళ్ల వాన, ఈదురుగాలులక పలువురి ఇళ్లు పూర్తి నేలమట్టమయ్యాయి. దీంతో కాలనీవాసులందరికీ పక్కా ఇళ్లు నిర్మించి, ఆదుకోవాలని కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు. ఈమేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ కాలనీలో రెవెన్యూ అధికారులు సందర్శించి పరిహారం ఇప్పించాలని కోరారు. ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పీఎస్‌లకు తరలిన సిబ్బంది

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ఆర్మూర్ నుంచి పోలింగ్ కేంద్రాల వద్దకు బయలుదేరుతున్న ఎన్నికల సిబ్బంది



ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సిబ్బందికి విధులు కేటాయిస్తున్న ఎన్నికల అధికారి వినోద్ కుమార్

ఆర్మూర్/రుద్రూర్/నందిపేట్/బోధన్/బాల్కొండ/వేల్పూర్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల కోసం అధికారులు అన్ని ఏర్పా ట్లు పూర్తి చేశారు. నేడు పోలింగ్ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది సామగ్రితో తరలివెళ్లారు. ఆర్మూర్ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు 217 ఉండగా, 1050 మంది సిబ్బందిని అధికారులు కేటాయించా రు. ఆర్మూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎన్నికల అధికారి తిరునగరి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని సిబ్బందికి విధులను కేటాయించారు. కలెక్టర్ రాజీ వ్ గాంధీ హన్మంతు సైతం విధుల కేటాయింపును పరిశీలించారు. బోధన్‌లోని విజయమేరీ హైస్కూల్‌లో ఈవీఎంలు ఇతర ఎన్నికల సామగ్రిని సిబ్బందికి పంపిణీ చేశారు. నియోజకవర్గ ఆర్వో రాజాగౌడ్ సామగ్రి పంపిణీని పర్యవేక్షించారు. నియోజకవర్గం పరిధిలో 246 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. సుమారు 3వేల మంది సిబ్బంది పోలింగ్ నిర్వహణకు నియమించామని ఆర్వో పేర్కొన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో 219 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మొదటి పోలింగ్ బూత్ బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్‌లో ఉంది. మొదటి ఓటరుగా గ్రామానికి చెందిన 45 ఏళ్ల మూగ భోజన్న ఉన్నారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

డొంకేశ్వర్‌లో మహిళ పోలింగ్ కేంద్రం

డొంకేశ్వర్(ఆర్మూర్): మోడల్ పోలింగ్ స్టేషన్‌లో భాగంగా ఎన్నికల కమిషన్ జిల్లాలో పలు చోట్ల మహిళ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. డొంకేశ్వర్ గ్రామ పంచాయతీ భవనంలో ఉమెన్స్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీలతో స్వాగత తోరణం ఏర్పాటుచేసి పూలతో పోలింగ్ కేంద్రంను అలంకరించారు. ఈ పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహించే అధికారులతో ఇతర పోలింగ్ సిబ్బంది మహిళలే ఉండనున్నారు.





బోధన్ నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



ఎన్నికల సామగ్రి పంపిణీని పర్యవేక్షిస్తున్న ఆర్డీవో



రాయకూర్ చేరుకున్న పోలింగ్ సిబ్బంది



బాల్కొండలో పోలింగ్ కేంద్రానికి వస్తున్న సిబ్బంది

వడగళ్ల వాన.. దెబ్బతిన్న పంటలు

డొంకేశ్వర్(ఆర్మూర్)/డిచ్‌పల్లి/ఎడపల్లి/నిజామాబాద్ రూరల్/నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్ సిటీ: జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు కురిసిన వడగళ్ల వానకు పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లోని మండలాల్లో జొన్న, పత్తి, మక్క పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. భారీ వడగళ్లతో పాటుగా ఈదురు గాలులు కూడా తోడవడంతో పంటలు నేల కొరిగాయి. అలాగే రోడ్లపై, కల్లాల్లో ఆరబోసిన వడ్లు తడిశాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబోయడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. కోతలు దాదాపుగా పూర్తి కావడంతో వరికి పెద్దగా నష్టం జరగలేదు. మబ్బులు వీడకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి తెచ్చిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి శ్రమించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాలకు పైనే నష్టం జరిగినట్లుగా తెలుస్తోంది. డిచ్‌పల్లి మండలం ముల్లంగిలో 250 ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా ధ్వంసమైంది. టీపీసీసీ కార్యదర్శి నగేశ్ ఈ పత్తి పంటను పరిశీలించారు. అధికారులంతా ఎన్నికల విధుల్లో ఉండడంతో పంట నష్టం లెక్కలను సేకరించడం సాధ్యం కాలేదని డీఏవో వాజిద్ హుస్సేన్ 'సాక్షి'తో పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం అధికారులతో నష్టపోయిన పంటల వివరాలను సేకరిస్తామని తెలిపారు. మోపాల్ మండలంలోని కంజర్ శివారులో సుమారు 40 ఎకరాల్లో మొక్కజొన్న పంట ధ్వంసమైంది. 25 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్, కూరగాయల పంటలు ధ్వంసమయ్యాయి.

వర్షపాతం వివరాలు..

జిల్లాలో అత్యధికంగా పోతంగల్‌లో 61.5 మిల్లీమీటర్లు, ఎడపల్లిలో 59.5, నిజామాబాద్ నార్త్‌లో 54.8, సౌత్‌లో 50.3 మిల్లీమీటర్లతో వర్షం కురిసింది. అలాగు కోటగిరి 47.0మి.మీ, బోధన్ 44.5మి.మీ,నిజామాబాద్‌రూరల్ 27.8మి.మీ, మాక్లూర్ 27.0మి.మీ, రెంజల్ 26.8మి.మీ, రుద్రూర్ 26.5మి.మీ, నవీపేట 24.0మి.మీ, కమ్మర్‌పల్లి 21.8మి.మీ, సాలూర 21.3మి.మీ, మోస్రా 20.5మి.మీ వర్షం కురిసింది.



రానాకలాన్‌లోని పంటపొలాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

విద్యుత్ సరఫరాకు అంతరాయం..

వడగళ్ల వానతోపాటు ఈదురు గాలులు బలంగా వీచడంతో పలుచోట్ల విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. అలాగే పలుచోట్ల చెట్లు విరిగిపడి విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంది. రోడ్లపై చెట్లు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్‌శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు సహాయక చర్యలు చేపట్టారు. ఎక్కడిక్కడ విద్యుత్ సరఫరా పునరద్దరణ చేస్తు ముమ్మరంగా పనులు చేపట్టారు. నగరంతో పాటు, బోధన్ పట్టణంతో కలిపి 78 స్తంభాలు, ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్నాయి. దీంతో సుమారు రూ. 10లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. నగర శివారు మాధవనగర్ వేణు ఇండస్ట్రీస్ గోదాం పైకప్పు రేకులు పూర్తిగా ఎగిరిపోయాయి. అలాగే రైస్‌మిల్‌కు చెందిన సామగ్రి సైతం దెబ్బతిన్నాయి. ఈ ఘటనలోరైస్‌మిల్‌కు దాదాపు రూ. కోటిన్నర నష్టం వాటిల్లినట్లు ఇండస్ట్రీస్ యాజమాని మూడ వేణుగోపాల్ తెలిపారు.



జానకంపేట లక్ష్మీనర్సింహస్వామి ఆలయ శిఖరంపై కూలిన చెట్టు



కంజర్ శివారులో ధ్వంసమైన మొక్కజొన్న పంట



రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో బుధవారం జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయికి జిల్లాస్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. బాలబాలికల విభాగంలో పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. బాలుర విభాగంలో తేజస్, అక్షయ్‌దీప్, రుకేష్‌గౌడ్, సరూష్, సాయిఅఖిల్‌చారీ, మోహన్‌దుర్గా ఎంపికయ్యారు. బాలికల్లో హైదవీశ్రీ, కీర్తన, శ్రీలక్ష్మీప్రియ, మేఘన, వినమర, జునైర అన్మల్ ఎంపికయ్యారు. ఈ నెల 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొనున్నారు.

బాల్కొండలో త్రిముఖ పోరు



ప్రశాంత్‌రెడ్డి (బీఆర్‌ఎస్ అభ్యర్థి)



సునీల్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్ అభ్యర్థి)



అన్నపూర్ణమ్మ (బీజేపీ అభ్యర్థి)

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర రాజకీయాలలో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్న బాల్కొండ నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీల మధ్య పోరు ఉత్కంఠను రేకెత్తిస్తుంది. అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి, ఏలేటి అన్నపూర్ణమ్మలు నువ్వా నేనా అంటూ పోటీ పడుతుండటంతో ఈ నియోజకవర్గంలో త్రిముఖ పోరు జరుగుతోంది. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డి గెలుపొందగా, ఈ ఎన్నికల్లోనూ ఆయన మూడోసారి తన అదృష్టంను పరీక్షించుకుంటున్నారు. 2018 ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన సునీల్‌కుమార్‌రెడ్డి ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిత్వం సాధించారు. ఎలాగైనా విజయం సాధిస్తామనే ధీమాతో ఆయన పోటీలో నిలిచారు. నాలుగుమార్లు ఆర్మూర్ ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండుమార్లు విజయం సాధించిన ఏలేటి అన్నపూర్ణమ్మ తొలిసారి తన సొంత నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆమె కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లికి చెందినవారు. రెండుమార్లు ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవంతో ఉన్న తాను ప్రజా సమస్యలపై అవగాహన ఉందని బాల్కొండ బరిలో విజయం తనదే అనే ధీమాలో ఉన్నారు. సునీల్‌రెడ్డి గెలిస్తే తొలిసారి అసెంబ్లీలో అడుగు పెడతారు. ప్రశాంత్‌రెడ్డి, అన్నపూర్ణమ్మలలో ఎవరు గెలిచినా మూడోసారి విజయం సాధించి, చరిత్ర సృష్టిస్తారు. ఏదేమైనా ముగ్గురు అభ్యర్థులు బాల్కొండ బరిలో నువ్వా నేనా అనే విధంగా పోటీ పడుతూ ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.



